# బైబై మమ్మీ.. లవ్ యూ.. జాగ్రత్త!

- తల్లికి మెసేజ్‌పెట్టి విద్యార్థి సూసైడ్
- పబ్జీ వ్యసనంతో బలవన్మరణం
- ఎల్లారెడ్డిగూడలో ఘటన

ఖైరతాబాద్, జనవరి 6: పబ్‌జీ గేమ్ ఓ విద్యార్థి ప్రాణం తీసింది. ఆన్‌లైన్ ఆటకు బానిసైన అతడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం ఈ విషాద ఘటన చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిగూడలోని గుమ్మడి అపార్ట్‌మెంట్స్‌లో పీ జయ తన కొడుకు అఖిల్ (21)తో కలిసి నివాసం ఉంటున్నారు. 2018లో భర్త విశ్వనాథ్ చనిపోవడంతో కొడుకు బాధ్యతలను ఆమె చూసుకుంటున్నది. శనివారం తన స్నేహితురాలి ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి జయ బయటకు వెళ్లారు. కొద్ది సేపటికి ఆమె ఫోన్ వాట్సాప్‌లో 'బైబై మమ్మీ.. లవ్ యూ జాగ్రత్త' అంటూ మెసేజ్ వచ్చింది. వెంటనే కొడుకుకు ఫోన్ చేయగా, స్విచ్ఛాఫ్ వచ్చింది. అపార్టుమెంట్‌కు వెళ్లి చూడగా, తలుపులు వేసి ఉన్నాయి. ఎంత పిలిచినా అఖిల్ పలుకకపోవడంతో వాచ్‌మెన్ సాయంతో తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లి చూడగా, ఉరివేసుకొని కనిపించాడు. వెంటనే చుట్టుపక్కల వారి సాయంతో నిమ్స్ దవాఖానకు తరలించగా, అప్పటికే చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. తన కొడుకు కొంతకాలంగా పబ్‌జీ గేమ్ ఆడుతుండే వాడని, ఆ వ్యసనమే ప్రాణాలు తీసిందని ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



బంజారాహిల్స్ ఐసీసీసీలోని పోలీస్ కమిషనరేట్‌లో కేసు వివరాలు వెల్లడిస్తున్న సీపీ

# ఆన్‌లైన్ గేమ్ పేరుతో సైబర్ మోసం

- ఘరానా నేరస్థుడి అరెస్టు.. 1.40 కోట్లు సీజ్

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 6 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ కేంద్రంగా ఆన్‌లైన్ గేమింగ్ పేరుతో అమాయక ప్రజలను మోసగించి రూ.కోట్లు దోచుకుంటున్న ఘరానా నేరస్థుడిని హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు శనివారం బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలోని నగర పోలీస్ కమిషనరేట్‌లో సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. హర్యానాకు చెందిన హితేశ్ గోయల్(36) 'డఫాబెట్' తదితర ఆన్‌లైన్ గేమింగ్ నిర్వాహకులతో కుమ్మక్కై అమాయక ప్రజలను మోసగిస్తున్నాడు. ఇందుకోసం ఢిల్లీలో ఒక ఆఫీస్‌ను ఏర్పాటుచేసి అక్కడి నుంచి ఆన్‌లైన్ గేమింగ్ మోసాలకు పాల్పడుతున్నాడు. పలువురు అమాయక ప్రజల బ్యాంక్ ఖాతా వివరాలతో పాటు వ్యాపారుల ఐడీలను తస్కరించి, వాటిని దుబాయ్‌లోని తన స్నేహితుడు సంజీవ్‌తో పాటు హాంకాంగ్, ఫిలిప్పీన్స్, చైనాలోని సైబర్ నేరగాళ్లకు చేరవేసి అక్రమ లావాదేవీలను నిర్వహిస్తున్నాడు. ఈక్రమంలోనే సోమాజిగూడకు చెందిన ఒక వ్యక్తిని డఫాబెట్.కామ్ గేమ్ వెబ్‌సైట్ ద్వారా ఆకర్షించి బాధితుడి వద్ద నుంచి 70 లక్షలు కొట్టేశాడు. గేమింగ్ ద్వారా ఎలాంటి లాభాలు రాకపోవటంతో మోసపోయినట్టు గ్రహించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. సైబర్ క్రైమ్ పోలీసులు రంగంలోకి దిగి నిందితుడిని ఢిల్లీలో అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. నిందితుడి వద్ద 1.40 కోట్ల నగదు, 23 మొబైల్ ఫోన్లు, మూడు హార్డ్ డిస్కులు, రెండు ల్యాప్‌టాప్‌లు, 36 బ్యాంక్ చెక్‌బుక్స్, 52 డెబిట్ కార్డులను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. సైబర్‌క్రైమ్, సిట్ జాయింట్ కమిషనర్ ఏవీ రంగనాథ్, సైబర్ క్రైమ్స్ డీసీపీ డీ కవిత, ఏసీపీ శివమారుతి పర్యవేక్షణలో సైబర్‌క్రైమ్ ఇన్‌స్పెక్టర్ హరిభూషన్‌రావు, ఎస్సై సురేశ్, హెచ్‌సీ వీ నర్సింగ్‌రావు, పీసీ జీ గోవిందరావు, బీ రవిశంకర్, జీ వెంకటేశ్, సీహెచ్ రాజేష్‌కుమార్, ఏ రాము, ఎన్ వంశీ కేసును ఛేదించినట్టు సీపీ తెలిపారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు.

# అభ్యర్థుల సందేహాలు తీర్చండి

- 15 వరకు 'స్టాఫ్‌నర్స్' అభ్యంతరాలు స్వీకరించండి
- 17లోగా నివృత్తి చేయండి
- అర్హులని తేలితే సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయండి
- ఎంహెచ్‌ఎస్‌ఆర్బీకి మంత్రి దామోదర ఆదేశం



హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): 'స్టాఫ్‌నర్స్' అభ్యర్థుల అభ్యంతరాలపై ప్రభుత్వం స్పందించింది. అభ్యర్థుల ఆందోళన నేపథ్యంలో వారి అభ్యంతరాలు నివృత్తి చేయాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ అధికారులను ఆదేశించారు. దీనికోసం ఈ నెల 15 వరకు అభ్యంతరాలు స్వీకరించాలని మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎంహెచ్‌ఎస్ఆర్బీ)ను ఆదేశించారు. అభ్యర్థుల సందేహాలను ఈ నెల 17లోగా నివృత్తి చేయాలని, ఒకవైళ ఎవరైనా అర్హులని తేలితే సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు అవకాశం కల్పించాలని చెప్పారు. మంత్రి ఆదేశాలు జారీ చేసిన కొద్దిసేపటికే.. స్టాఫ్‌నర్స్ అభ్యర్థులు ఏమైనా సందేహాలు ఉంటే 15న సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు ప్రకటించింది. రాష్ట్రంలో 9 విభాగాల్లో 7,094 స్టాఫ్‌నర్స్ ఖాళీల భర్తీకి నిరుడు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎంహెచ్‌ఎస్ ఆర్బీ) పరీక్ష నిర్వహించింది. డిసెంబర్ 28న మెరిట్ జాబితాను విడుదల చేసింది. బండ్లగూడలోని ఎక్సైజ్ అకాడమీ ప్రాంగణంలో డిసెంబర్ 30న సర్టిఫికెట్ల వెరిఫికేషన్ మొదలైంది. సుమారు 40 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. మెరిట్ జాబితాను విడుదల చేశారు. సాధారణంగా మెరిట్‌లిస్ట్ పెడితే.. వెబ్‌సైట్‌లోనే అభ్యర్థుల ఓఎంఆర్ షీట్ కూడా అప్‌లోడ్ చేస్తారు. అభ్యర్థులు తమ ఓఎంఆర్ షీట్‌ను స్వయంగా చూసుకుని అభ్యంతరాలు తెలిపే అవకాశం ఉంటుంది. మెరిట్ జాబితానే 1,419 పేజీలు ఇచ్చారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం 200 పేజీలతో 9,892 మంది అభ్యర్థుల జాబితా విడుదల చేశారు. అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లు అందుబాటులో లేవు. ఎన్ని మార్కులు వచ్చాయో స్వయంగా చూసుకునే అవకాశం లేదు. ఒక అభ్యర్థి తన జోన్‌లో, తన రిజర్వేషన్ క్యాటగిరీలో ఎన్ని మార్కుల వారిని పిలిచారో తెలుసుకోవాలంటే 1,419 పేజీల మెరిట్ జాబితాలోని 9,892 హాల్‌టికెట్ నంబర్లను వెతుక్కొని చెక్ చేసుకోవాల్సిందే. ఎన్ని మార్కులు వచ్చినవారిని వెరిఫికేషన్‌కు పిలిచారన్న వివరాలు లేక అభ్యర్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తమకన్నా తక్కువ మార్కులు వచ్చినవారిని ఎంపిక చేశారంటూ కొందరు ఇటీవల డీఎంఈ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. జోన్లు, రిజర్వేషన్ క్యాటగిరీల వారీగా మెరి ట్, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జాబితాలను విడుదల చేసి తమ అనుమానాలను నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు.

## 13 నుంచి 16 వరకు కాలేజీలకు సెలవులు

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని జూనియర్ కళాశాలల్లో సంక్రాంతి సెలవుల్లో ప్రత్యేక తరగతులను నిర్వహించవద్దని ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ శృతి ఓజా హెచ్చరించారు. ఈ నెల 13 నుంచి 16 వరకు సెలవులుగా పాటించాలని, తిరిగి కళాశాలలు 17న పున:ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్, గురుకుల జూనియర్ కళాశాలలు ఈ ఆదేశాలను పాటించాలని స్పష్టం చేశారు. ఒకవేళ ఆయా రోజుల్లో తరగతులు నిర్వహిస్తే తీవ్రం గా పరిగణించి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు చేయండి

ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లకు ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా లేఖలు రాశారు. ఫిబ్రవరి 28 నుంచి మార్చి 18 వరకు నిర్వహించనున్న ఈ పరీక్షల నిర్వహణకు సీఎస్ డీవోలు, స్క్వాడ్, పోలీసు, రవాణా, పోస్టల్ సిబ్బంది నియామకాలు సహా ఇతర అంశాలపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



కోఠిలోని తెలంగాణ మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు కార్యాలయంలో అభ్యర్థులతో కలిసి వినతిపత్రం అందజేస్తున్న నిరుద్యోగ జేఏసీ చైర్మన్ మానవతారాయ్

## 9 మార్కులొచ్చినా మెరిట్ లిస్టులో పేరా?

- 50 మార్కులొచ్చినా ఉండదా?
- స్టాఫ్‌నర్సుల ఎంపిక ప్రక్రియను వెంటనే రద్దు చేయాలి
- తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జేఏసీ చైర్మన్ మానవతారాయ్

సుల్తాన్‌బజార్, జనవరి 6: లోపభూయిష్టంగా నిర్వహించిన స్టాఫ్‌నర్సుల నియామక ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలని తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కోటూరి మానవతారాయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 9 మార్కులు వచ్చిన వారి పేరులో మెరిట్ లిస్టులో ఉన్నదని, 50 మార్కులు వచ్చినవారి పేరు లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. శనివారం కోఠిలోని తెలంగాణ మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు కార్యాలయం ఎదుట నర్సింగ్ అభ్యర్థులతో కలిసి ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బోర్డు కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన నర్సింగ్ అభ్యర్థులకు నియామకాల్లో తీవ్ర అన్యాయం జరుగుతున్నదని, గ్రూప్-2 పరీక్ష రద్దు తరహాలో ఈ నర్సింగ్ నియామకాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తక్కువ మార్కు లు వచ్చిన వారు, నకిలీ సర్టిఫికెట్లు పెట్టిన వారిని మెరిట్ లిస్టులో నమోదు చేసి, 50కి పైగా మార్కులు వచ్చిన అర్హులైన అభ్యర్థులను నిర్దాక్షిణ్యంగా తొలగించారని మండిపడ్డారు. ఏ నియామకాల్లోనైనా మార్కులు కలుపుతారని, కానీ ఈ నర్సింగ్ నియామకాల ప్రక్రియలో మాత్రం వెయిటేజీ మార్కులను తొలించడం ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

## విద్యా - ఉద్యోగ సమాచారం

### బీసీ గురుకులాల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు

హైదరాబాద్, జనవరి6 (నమస్తే తెలంగాణ): మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 6, 7,8 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు బీసీ సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి మల్లయ్యభట్టు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తంగా 4,000 వేల సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. తల్లిదండ్రుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో 1.50 లక్షలు, పట్టణాల్లో 2 లక్షలు మించకూడదని, విద్యార్థులు సోమవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మార్చిలో రాత పరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా విద్యార్థుల ఎంపిక చేయనున్నట్టు తెలిపారు.

### మే రెండో వారంలో 'పాలిసెట్'

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పాలిసెట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్‌ను మే రెండో వారంలో నిర్వహించనున్నారు. ఇటీవల జరిగిన సమావేశంలో ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకోగా, పరీక్ష తేదీ సహా నోటిఫికేషన్ వివరాలను వారంలోగా ప్రకటించనున్నారు. పదో తరగతి హాల్‌టికెట్లు విడుదలైన తర్వాత పాలిసెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభంకానున్నది. ఈ హాల్‌టికెట్ నంబర్‌ను ఎంటర్ చేస్తేనే దరఖాస్తు చేసుకునే వీలుండటంతో ఆ తర్వాతే పూర్తి నోటిఫికేషన్ విడుదల కానున్నది. ఈ ఏడాది ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో పాలిసెట్ ఎంట్రెన్స్ కోసం ఉచిత శిక్షణనిచ్చే అంశాన్ని సాంకేతిక విద్యాశాఖ అధికారులు పరిశీలిస్తున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులను పాలిటెక్నిక్ కోర్సుల వైపు ఆకర్షింపజేయడం.. ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో అడ్మిషన్లను పెంచేందుకు 'పాలిక్వెస్ట్' పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి అధికారులు రూపకల్పన చేశారు. దీనికోసం ప్రభుత్వం అనుమతి రాగానే దీనిపై నిర్ణయాన్ని ప్రకటించనున్నారు.

### ఇంటర్ కాలేజీలకు నిధులు విడుదల

హైదరాబాద్, జనవరి 6(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు రోజువారీ నిర్వహణ వ్యయం కింద ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. ఒక్కో కాలేజీకి ఏటా రూ.2 లక్షల చొప్పున ఇవ్వాల్సి ఉండగా, ఒక త్రైమాసికం కింద మొత్తం రూ.50,13,340 నిధులను ఇంటర్ విద్య కమిషనరేట్ అధికారులు కళాశాలల ఖాతాలకు బదిలీచేశారు.

### ఇంటర్‌లోనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులు

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఆరు కొత్త కోర్సులను ప్రవేశపెట్టాలని ఇంటర్ విద్యాశాఖ అధికారులు నిర్ణయించారు. కంప్యూటర్ సైన్స్ స్ట్రీమ్‌లో 3, ఎలక్ట్రానిక్స్ స్ట్రీమ్‌లో 3 చొప్పున మొత్తం 6 కోర్సులను తీసుకురానున్నారు. కంప్యూటర్ సైన్స్ స్ట్రీమ్‌లో సైబర్ ఫిజికల్ సిస్టమ్స్, సెక్యూరిటీ (సీపీఎస్), క్లౌడ్ కంప్యూటింగ్, బిగ్‌డాటా అనాలసిస్ (సీసీ,బీడీఏ), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ (ఏఐఎంఎల్), ఎలక్ట్రానిక్స్ స్ట్రీమ్‌లో బయో మెడికల్ ఇంజినీరింగ్ టెక్నీషియన్ (బీఎంఈ), ఎంబెడెడ్ సిస్టమ్స్ (ఈఎస్), ఎలక్ట్రానిక్స్ అండ్ వీడియో ఇంజినీరింగ్ టెక్నీషియన్ (ఈవీఈ) కోర్సులు ఉన్నాయి. బజార్‌ఘాట్, నల్లగొండ, మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కాలేజీలు, నాంపల్లి, కూకట్‌పల్లి, హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో రెండేసి చొప్పున కోర్సులను ప్రవేశపెట్టనున్నారు. జూన్‌లో కొత్త కోర్సుల్లో ప్రవేశాలు కల్పించాలని అధికారులు నిర్ణయించారు.

### పదోన్నతుల్లో వివాదాలు పరిష్కరించండి: జాక్టో

హైదరాబాద్, జనవరి 6(నమస్తే తెలంగాణ): కోర్టు వివాదాలను పరిష్కరించి, పదోన్నతులు కల్పించాలని జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్ (జాక్టో) ప్రభుత్వాన్ని కోరింది. జాక్టో ప్రతినిధి బృందం శనివారం విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంను కలిసి ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించింది. ఎస్సీఈఆర్టీలో డిప్యూటేషన్లు రద్దు చేయాలని, టెట్ నుంచి మినహాయించి పదోన్నతులు ఇవ్వాలని, పాఠశాలలకు పారిశుధ్య కార్మికులను కేటాయించాలని, బడులకు ఉచిత విద్యుత్తు, ఇంటర్నెట్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జాక్టో బాధ్యులు పర్వత్‌రెడ్డి, సదానంద్‌గౌడ్, హేమచంద్రుడు, మోహన్‌రెడ్డి, కృష్ణుడు, రాధాకృష్ణ, చంద్రశేఖర్, చైతన్య, గౌరిశంకర్, దానయ్య, అంజయ్య, గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.


